

పిడుగుపాటుతో గిరిజనుడు మృతి

మరొకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండలంలో బుధవారం మధ్యాహ్నం భారీ పిడుగుల శబ్దాలతో కూడిన భారీ వర్షంగా ఓ గిరిజన యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు పరిస్థితి విషమంగా ఉంది. మండలంలో బుధవారం మధ్యాహ్నం భారీ పిడుగుల వర్షం కురిసింది. ఆ సమయంలో పశువుల మేతకు తీసుకెళ్లిన ఇంద్రుమ్ పంచాయతీ ఉజ్జంగి గ్రామంలోని పాంగి జోయో (28) అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు దొంబురు తీవ్ర గాయలై పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబీకులు 108 అంబులెన్స్‌లో అరకులోయ ఏరియా హాస్పిటల్ కు తరలించారు.



సపర్యలు చేస్తున్న కుటుంబీకులు

బోయ/వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చడంపై..

ఎమ్మెల్యే ఫాల్గుణకు నిరసన సెగ



రోడ్డుపై బైఠాయించిన గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి-హుకుంపేట: స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాల పక్కన గొంది వైయస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీకి వచ్చిన ఎమ్మెల్యే ఫాల్గుణకు నిరసన సెగ తగిలింది. బోయ/వాల్మీకి బీసీలను ఎస్టీ జాబితాలో చేర్చడంపై ముందుగా రోడ్డుపై బైఠాయించిన గిరిజన సంఘం నేతలు ఎమ్మెల్యే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనకు దిగారు. అనంతరం గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక గిరిజన సంఘం ఆఫీస్ నుంచి ప్రాంగణం వరకు ర్యాలీ చేస్తూ రోడ్డుపై బైఠాయించి ఆందోళన దిగారు. గిరిజన ద్రోహి ఎమ్మెల్యే రాజీనామా చేయాలని ఆందోళన చేశారు. బోయ/వాల్మీకి బీసీలను ఎస్టీ జాబితాలో చేర్చడంపై గిరిజన ఎమ్మెల్యేగా ఎందుకు తిరస్కరించలేదంటూ ప్రశ్నించారు. బోయ వాల్మీకి తీర్మానం ఎమ్మెల్యే వైఖరి బహిర్గతం చేయాలని, ఎంపీ, ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గిరిజన సంఘం నేతలు కృష్ణారావు, లక్ష్మణరావు,వైస్ ఎంపీపీ కొండలరావు మాట్లాడుతూ, గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపీలుగా ఈ విషయమై చట్టసభల్లో ఎందుకు ప్రశ్నించలేదని వారు నిలదీశారు. గిరిజన హక్కులు, చట్టాలను కాపాడేందుకు నమ్మి ఆందోళ ఎక్కిస్తే నిజమైన గిరిజనులకు నష్టం జరుగుతున్నా నోరు మెదపకపోవడం వెనక అంతర్యం ఏమిటో బహిర్గతం చేయాలన్నారు. సొంత ప్రయోజనాల కోసం గిరిజనులకు తాకట్టు పెట్టడం సరైనది కాదని వారు అన్నారు. బోయ/వాల్మీకులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారని, వీరిని ఎస్టి జాబితాలో చేరిస్తే నిజమైన గిరిజనులకు ముప్పు వాటిల్లుతుందన్నారు. వెంటనే ఎమ్మెల్యేలు, ఎంపీలు స్పందించి తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపించాలని వారు కోరారు. లేనిపక్షంలో ఎమ్మెల్యే ఎంపీలు పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకురాలు మాజీ సర్పంచ్ లక్ష్మి, ప్రమీల, ప్రజా సంఘం నేతలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఫాల్గుణను నిలదీస్తున్న గిరిజన సంఘం నేతలు

పాడేరులో ఎమ్మెల్యే ఇంటి ముందు జేఏసీ ఆందోళన

ప్రజాశక్తి-పాడేరు: బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితా లో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ జేఏసీ పాడేరు తలారిసింగి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు గ్రామస్తులు బుధవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఇంటిని ముట్టడించి ఆందోళన జరిపారు. ఈ సందర్భంగా మహిళలు, గ్రామస్తులు ఎమ్మెల్యే ఇంటి వరకు ర్యాలీ నిర్వహించారు. కొంతసేపు ఎమ్మెల్యే ఇంటి ముందు ఆందోళన చేశారు.సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.తమ గ్రామాలకు వైసిపి స్టిక్కర్ గ్యాంగ్ రాకూడదంటూ ప్లకార్డు పట్టుకొని ప్రదర్శన జరిపారు.తలారి సింగి గ్రామంలో ఎమ్మెల్యే ఇంటి ముందు ఆందోళన చేస్తుండగా పోలీస్ అధికారులు వచ్చి ఎమ్మెల్యే ఇంటి వద్ద లేరని నిరసన కారులకు నచ్చ చెప్పి ఆందోళన విరమింప చేసి అక్కడ నుంచి పంపించారు.



ఆందోళన చేస్తున్న జెఎసి నేతలు

ఎమ్మెల్యే ధనలక్ష్మి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-మారేడుమిల్లి: బోయ వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దని నిరసనలు చేపడుతున్న ఆదివాసీ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ రంపచోడవరం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి దిష్టిబొమ్మను గిరిజన సంఘం ఆధ్వర్యాన బుధవారం మండలంలోని భీమవరంలో దహనం చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు ఈతపల్లి సత్యనారాయణ రెడ్డి, ఈతపల్లి సిరిమల్లిరెడ్డి, సర్పంచ్ మల్లీశ్వరి మాట్లాడుతూ బోయ వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చే జీవో నెంబర్ 52ను వెంటనే రద్దు డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులతో ఆదివాసీల గొంతులను నొక్కలేరని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

గంజాయి సాగు నిర్మూలనకు కృషి

-నూతన ఎస్‌పి తుహిన్ సిన్హా -బాధ్యతల స్వీకరణతో అధికారుల సత్కారం



ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు ఎస్‌పిగా నియమితులైన తుహిన్ సిన్హా బుధవారం పాడేరు జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఆయన 2017 బ్యాచ్ ఆంధ్రప్రదేశ్ కేడర్ కు చెందినవారు. గత పది నెలలుగా పాడేరులోని ఎస్పీ కార్యాలయంలోనే అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) గా విధులు నిర్వహిస్తున్నారు. పదోన్నతిపై జిల్లా ఎస్పీగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లాలోని పలువురు పోలీస్ అధికారులు ఎస్పీ కార్యాలయం సిబ్బంది తదితరులు ఆయనకు పుష్పగుచ్చాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. పోలీస్ లాంఛనాలతో ఆయనకు స్వాగత సత్కారాలు చేశారు. అనంతరం ఆయన జిల్లా కేంద్రం విలేకరులతో ముచ్చటించారు. తన మొదటి పోస్టింగ్ విశాఖపట్నం గ్రేహౌండ్స్ అసిస్టెంట్ కమాండర్.. ఆ తర్వాత నర్సీపట్నం ఏఎస్పీగా కర్నూల్లో అడిషనల్ ఎస్పీ (ఎస్ఈబీ) గా విధులు నిర్వర్తించానని ఆయన వెల్లడించారు. అల్లూరి ఏజెన్సీలో ప్రధాన సమస్యలపై తాను దృష్టి సారిస్తానని, గంజాయి సాగు నిర్మూలనకు కషి చేసి, రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టే విధంగా చైతన్య పరుస్తామన్నారు. ఏజెన్సీలో మావోయిస్టుల కార్యకలాపాల నియంత్రణ పెద్ద ఛాలెంజ్ అని, గతంలో పనిచేసిన అధికారుల మాదిరిగానే ఆపరేషన్ నిర్వహించి అదే పాలసీ తాను కొనసాగిస్తానని ఆయన వెల్లడించారు. దీనిలో భాగంగానే ప్రతిరోజు సీఆర్పీఎఫ్ గ్రేహౌండ్స్ బలగాలతో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఏవోబిలో మావోయిస్టు కదలికలు తక్కువగా ఉన్నాయని చెప్పారు. ఎస్పీని కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో పాడేరు అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్లు సుధాకర్, రుద్ర శేఖర్, పలువురు సబ్ ఇన్స్పెక్టర్లు, ఎస్పీ కార్యాలయం ఏవో తిలక్ ఉన్నారు.



మాట్లాడుతున్న విజయప్రతాప్‌రెడ్డి, చిత్రంలో సబ్ కలెక్టర్ శుభం బన్సల్ తదితరులు

ఆకలి మరణాలు సంభవించకుండా చర్యలు

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి

ప్రజాశక్తి - రంపచోడవరం


జాతీయ ఆహార భద్రత చట్టం ప్రకారం పేదల ఆకలి మరణాలు సంభవించకుండా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సిహెచ్.విజయ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో జిల్లా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్, గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్, 11 మండలాలకు చెందిన సివిల్ సప్లై, విద్యాశాఖ అధికారులు, ఐసిడిఎస్ సిడిపిఓలు, అంగన్వాడీ సూపర్‌వైజర్లతో రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ సమక్షంలో విజయ ప్రతాప్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా నిర్వహిస్తున్న భోజన పథకాలకు అన్ని నిబంధనల ప్రకారం మెనూ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులు ఇతర జిల్లాలకు వెళ్లినప్పుడు ఆన్లైన్ ద్వారా ఎక్కడైనా రేషన్ తీసుకొని వెసులుబాటు ఉందని తెలిపారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో ఫ్యాన్లు ఏర్పాటు చేయడానికి జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలో సమర్పించాలన్నారు. పాఠశాలలకు సరఫరా చేసే సరుకులు తాజాగా ఉండాలన్నారు. ఈ ఫుడ్ కమిషన్ ద్వారా అవినీతి లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. మధ్యాహ్న భోజన పథకం, అంగన్వాడీ కేంద్రం, వివిధ రకాలైన వసతి గృహాలకు సరఫరా చేసే గుడ్లు 45 నుండి 50 గ్రాముల బరువు ఉండాలని సూచించారు. వసతి గృహ విద్యార్థులకు వారానికి రెండు రోజులు 80 గ్రాముల తాజా కోడి మాంసం పెట్టాలన్నారు. బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎక్కడైనా మరుగుదొడ్లకు సంబంధించిన డోర్లు రిపేర్లు ఉంటే వెంటనే చేయించాలన్నారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై డిప్యూటీ డైరెక్టర్ పి సురేష్, జిల్లా అధికారి ఆర్.శివ ప్రసాద్, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి సూర్యలక్ష్మి, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్ రాజ్, డిఎంఓ గణేష్ కుమార్, ఎడిఎంహెచ్ఓ డాక్టర్ అనూష, ఎఎంఓ సి.శ్రీహరి, జిసిసి డివిజనల్ మేనేజర్ జి పార్వతీశ్వరరావు, సిడిపివోలు సంధ్యారాణి. ప్రసన్నకుమారి, ఎంఇఒలు ఎం.సత్యనారాయణ దొర, మల్లేశ్వరరావు, ఏటిడబ్ల్యూఓ రామ తులసి, జిసిసి మేనేజర్లు ముర్ల నాగరాజు రెడ్డి, విజయలక్ష్మి, పాల్గొన్నారు.



రిజర్వు ఫారెస్టు భూములను పరిశీలిస్తున్న అధికారులు

రిజర్వు ఫారెస్టు భూముల పరిశీలన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని జడ్డంగి, సూరంపాలెం, శరభవరం గ్రామాల్లో హైవే రోడ్డుకు అప్పగించే రిజర్వు ఫారెస్ట్ భూములను స్థానిక తహశీల్దారు సిహెచ్ సుబ్రమణ్య ఆచారి, అటవీశాఖ రేంజర్ ఎం అబ్బాయిదొర, ఎంపీడీవో బాపన్నదొర బుధవారం పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 516 జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న 0.32 హెక్టార్లు, సూరంపాలెం వద్ద 3.82 హెక్టార్లు, దాకరాయి వద్ద 8.06 హెకార్టు అటవీశాఖ రిజర్వు భూమిని పరిశీలించారు. ఆయా గ్రామాల్లో గ్రామ సభలు పక్కాగా నిర్వహించి తీర్మానాలు అనంతరం హైవే నిర్మాణ సిబ్బందికి అప్పగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.




సర్వే చేస్తున్న బృందం సభ్యులు

గ్రామాల్లో కుటుంబ ఆరోగ్య సర్వే

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ పరిధి రాళ్లగడ్డ, చౌడుపల్లి గ్రామాల్లో బుధవారం జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేను సిగ్మా రీచార్జ్ కన్సల్టెన్సీ ఏజెన్సీ బృందం చేపట్టింది. బృందం సభ్యులు నూకరాజు, రమేష్, కృష్ణ నాయక్ సర్వే చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్దేశించిన గ్రామానికి మ్యాపింగ్ చేస్తూ కుటుంబ సభ్యులు వివరాలు నమోదు చేసుకుంటామని వెల్లడించారు. ఆరోగ్య విషయాలు తెలుసుకుని వివరాలు నమోదు చేస్తామని తెలిపారు. సర్వే నివేదిక వివరాలు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ సర్వే సంస్థకు నివేదిక అందజేస్తామని పేర్కొన్నారు. ఫీల్డ్ యాక్టివిటీని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ పాపులేషన్ సైన్స్ (ఐఐపియస్), ముంబై డీ మార్డ్ (యస్ఐజియమ్ఎ) యూనివర్సిటీ రీసెర్చ్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే ఫీల్డ్ ఏజెన్సీ సహకారంతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు, గ్రామ వాలంటీర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మూలపేటలో 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి'


ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని డౌనూరు పంచాయతీ పరిధి మూలపేటలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి బుధవారం నిర్వహించారు. ప్రజలను కలుసుకొని వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గొలిసింది సత్యనారాయణ, ఉల్లి వెంకటేశ్వర్లు, తోట దొరబాబు, కొర్రు రామ్మూర్తి, పి.కృష్ణ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, టిడిపి నాయకులు

గిరిజనులకు ఉత్తమ సేవలు

నూతన ఐటిడిఎ పిఒ అభిషేక్



ప్రజాశక్తి-పాడేరు టౌన్: పాడేరు ఐటిడిఎ నూతన పిఒగా వి.అభిషేక్ బుధవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పిఒగా పని చేసిన రోనంకి గోపాలక్రిష్ణ సర్వే, సెటిల్ మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనరేట్ అదనపు సంచాలకులు (ఎడి)గా బదిలీ అయిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలోనే పెద్దదైన పాడేరు ఐటిడిఎకు పిఒగా ఆయన 2021 జూన్ 14న పదోన్నతిపై వచ్చారు. దాదాపు రెండు సంవత్సరాల పాటు ఆయన పని చేశారు. సబ్ కలెక్టర్ గా పని చేస్తున్న వి.అభిషేక్‌కు పాడేరు ఐటిడిఎ పిఒగా పదోన్నతి కల్పించారు. ఆ మేరకు ఐటిడిఎ పిఒగా అభిషేక్ బాధ్యతలు స్వీకరించారు. ఐటిడిఎ ఎపిఒలు వి.ఎస్.ప్రభాకర్‌రావు, ఎం.వేంకటేశ్వరరావు, పరిపాలనాధికారి హేమలత పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలియ జేసారు. ఎడిఎంహెచ్ఒ జమాల్ భాషా, పిహెచ్ఒ అశోక్, టిడబ్ల్యూ డిడి ఐ.కొండలరావు, ఇఇ డివిఆర్ఎం రాజు, కేర్ అధికారి శుబ్రమణ్యం, డిఆర్ డిఎ పిడి మురళి, ఎస్‌డిసి శర్మ శుభాకాంక్షలు తెలియజేసారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ, గిరిజనులకు ఉత్తమ సేవలందిస్తానని చెప్పారు. రెండు సంవత్సరాలుగా ఏజెన్సీలో సేవలందిస్తున్నానని చెప్పారు. గిరిజన ప్రాంతంపై అవగాహన ఉందని అన్నారు. అందరి సహకారంతో అభివృద్ధి చేస్తానని అన్నారు. ముందుగా ఐటిడిఎ గార్డెన్‌లో మొక్కలు నాటారు.



చెక్కును అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ఇబిసి లబ్ధిదారులకు

రూ. 92.70 లక్షలు జమ

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలోని 618 మంది లబ్దిదారులకు ఈబీసీ నేస్తం రెంతడో విడత కింద రూ.92.70 లక్షలను నేరుగా లబ్దిదారుల ఖాతాలకు రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ప్రకాశం జిల్లా మార్కాపురం నుండి సీఎం ప్రారంభించిన ఈబిసి నేస్తం రెండవ విడత ఆర్థిక సహాయ కార్యక్రమాన్ని బుధవారం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఐటిడిఏ పిఓ రోణంకి గోపాల క్రిష్ణ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మొదటి విడత ఎంత మందికి వచ్చిందని లబ్దిదారులను అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డి ఎ పిడి వి.మురళి, బిసి కార్పోరేషన్ ఎఇఒ కె.శంకరరావు పాల్గొన్నారు.

భద్రాచలం మాజీ ఎమ్మెల్యే

కుంజా బొజ్జికి ఘన నివాళి

ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ప్రతిన



అడవి వెంకన్న గూడెంలో కుంజా బొజ్జి స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తొలితరం కమ్యూనిస్టు, గిరిజనోద్యమ నేత, భద్రాచలం మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు కుంజా బొజ్జి 2వ వర్ధంతి కార్యక్రమాలు విలీన నాలుగు మండలాల్లో బుధవారం సిపిఎం శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. బొజ్జి స్థూపానికి, ఆయన చిత్ర పటాలకు సిపిఎం నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ప్రతినపూనారు.

ప్రజాశక్తి-విఆర్.పురం

అమరజీవి కుంజా బొజ్జి స్వగ్రామం మండలంలోని అడవి వెంకన్న గూడెంలో ఆయన స్మారక స్థూపం వద్ద సిపిఎం నాయకులు, బొజ్జి కుటుంబ సభ్యులు పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. స్మారక స్థూపం వద్ద ఏర్పాటు చేసిన సిపిఎం జెండాను ఎంపిపి కారం లక్ష్మి ఎగుర వేశారు. బొజ్జి చిత్ర పటానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, బొజ్జి సతీమణి లాలమ్మ స్మారక స్థూపానికి పార్టీ మండల కార్యదర్శి సోయం చిన్న బాబు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. బొజ్జి ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని ఈ సందర్భంగా సిపిఎం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కుంజా నాగిరెడ్డి, ఆసు లక్ష్మయ్య, చినమట్టపల్లి ఎంపిటిసి పూనెం ప్రదీప్ కుమార్, కారం సుందరయ్య, వల్ల కృష్ణారెడ్డి, వడ్లాది రమేష్, పార్టీ గ్రామ శాఖ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రేఖపల్లి సిపిఎం కార్యాలయంలో..

మండల కేంద్రం రేఖపల్లిలోని సిపిఎం కార్యాలయం బొప్పెన భీమయ్య భవనంలో కుంజా బొజ్జి చిత్ర పటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పూనెం సత్యనారాయణ, సోయం చిన్నబాబు, పూనెం ప్రదీప్ కుమార్, గూటాల శ్రీనివాస్, పోడియం శ్రీరామ్మూర్తి, గుండెపూడి లక్ష్మణరావు, తాతబాబు రెడ్డి, ఆత్మకూరు కాంతారావు, వల్ల కృష్ణారెడ్డి, సోడే మల్లయ్య, కుంజా కన్నయ్య, చిక్కల పద్మారావు పాల్గొన్నారు.

ఎటపాక : ఎటపాకలో జరిగిన కుంజా బొజ్జి వర్ధంతి సభలో సిపిఎం మండల కార్యదర్శి ఐవి మాట్లాడుతూ గిరిజనుల కోసం, గిరిజనేతర పేదల కోసం భద్రాచలం నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసం సిపిఎం ఎర్రజెండా చూపిన మార్గంలో తుది శ్వాస వరకు పయనించిన మహనీయుడు, గిరిజన ముద్దుబిడ్డ కుంజా బొజ్జి అని తెలిపారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా చేసిన ఆయన ఎటువంటి ఆస్తులు సంపాదించుకోకుండా, ప్రజల కోసమే తన జీవితాన్ని త్యాగం చేసి మచ్చలేని మహానాయకుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు డేగల మాధవరావు, ఆకిశెట్టి రాము, ఐ.పద్మ, మండల కమిటీ సభ్యులు జి.హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.




చింతూరు మండలం ఎర్రంపేటలో నివాళులర్పిస్తున్న దృశ్యం

చింతూరు : మన్యం ఆదివాసీల ఆశాజ్యోతి కామ్రేడ్ కుంజా బొజ్జి ఆశయ సాధనకు సిపిఎం కార్యకర్తలు ముందుకు నడగాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కుంజా సీతారామయ్య పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ఎర్రంపేట రచ్చబండ సెంటర్ వద్ద గ్రామ శాఖ ఆధ్వర్యంలో కుంజా బొజ్జి చిత్ర పటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీపై ఆ నాడు ఫారెస్ట్ అధికారులు, భూస్వాముల దాడులను ఎదుర్కొని ప్రజలను ఐక్యం చేసి వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా బొజ్జి నాయకత్వంలో పోరాటం చేసినట్టు చెప్పారు. బొజ్జి సాధారణ పార్టీ సభ్యుడు నుండి సమితి అధ్యక్షుడిగా, ఉమ్మడి భద్రాచలం ఎమ్మెల్యేగా పని చేసి, ఏజెన్సీ సుందరయ్యగా పేరుపొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్, నాయకులు ఎర్రశెట్టి శ్రీనివాసరావు, పోడియం, లక్ష్మణ్, పాండు సుబ్బారావు, కారం కొండయ్య, కారం రాజయ్య, సుందరయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

కూనవరం : గిరిజన హక్కుల కోసం, గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం చట్ట సభల్లోనూ, స్థానికంగా నాయకత్వం వహించిన ధీశాలి కుంజా బొజ్జి అని సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య అన్నారు. కుంజా బొజ్జి ద్వితీయ వర్ధంతి సభ స్థానిక సిపిఎం కార్యాలయంలో నిర్వహించారు. ఆయనకు ఘనంగా విప్లవ జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కుంజా రాధ, బొజ్జ సుధా, కారం జయసుధ, బొగ్గా రామారావు, బొగ్గా వెంకమ్మ, ధర్ముల అమ్మాజీ, కట్టం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఎటపాకలో బొజ్జి చిత్ర పటానికి పూలమాలలు వేస్తున్న సిపిఎం నాయకులు



కూనవరంలో...

భూసారాన్ని బట్టి ఎరువుల వినియోగం

జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బిఎస్ నంద్

ప్రజాశక్తి-పాడేరు: భూమిలోని పోషకాలు స్థాయిని బట్టి ఎరువులను వినియోగిస్తే సాగు ఖర్చు తగ్గటమే కాకుండా అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయి అధికారి ఎస్‌బిఎస్ నంద్ సూచించారు. భుదవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయి అధికారులకు, గ్రామా వ్యవసాయి సహాయకులకు నిర్వహించిన భూసార పరీక్షల అవగాహనా సదస్సులో నంద్ మాట్లాడుతూ, పంట సాగులో పోషకాల యాజమాన్యం కీలకం అన్నారు. అందుకు అనుగుణంగా జిల్లాలో విస్తత స్థాయి భూసార పరీక్షలు నిర్వహించడానికి వ్యవసాయి శాఖ కృషి చేస్తోందని అన్నారు. అందులో భాగంగా మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్ష కేంద్రానికి పంపిస్తు న్నామన్నారు. పంటలను తరచూ పరిశీలించడం ద్వారా భూమిలో పోషక లోపాలను గుర్తించి రైతులకు తెలియజేయాలని, సేంద్రియ పంటల సాగును ప్రోత్సహిస్తూనే అవసరమైన పోషకాలను అందించి దిగుబడులు తగ్గకుండా చూడాలని కోరారు. వ్యవసాయి సలహా, సాంకేతిక కేంద్రం (ఏరువాక కేంద్రం) శాస్త్రవేత్తలు డాక్టర్ జె.జగన్నాధం, డాక్టర్ వెంకట్రావు, భూసార పరీక్షల నిర్వహణ విధానం, ఫలితాలు, విశ్లేషణ, ఎరువుల వినియోగం రైతులకు సలహాలు, సూచనలు అందించడం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ అవగాహనా సదస్సులో జిల్లాలోని 22 మండలాల వ్యవసాయి అధికారులు, ఎంపిక చేసిన గ్రామ వ్యవసాయి సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి -హుకుంపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైయస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ కార్యక్రమం మండలంలోని స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాల పక్కన గ్రౌండ్లో సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలో ఉన్న డ్వాక్రా మహిళల అక్కచెల్లెళ్లకు చెక్కు పంపిణీ అరకు ఎమ్మెల్యే శెట్టి పాల్గుణ చేతుల మీదుగా డ్వాక్రా మహిళలకు చెక్కులు పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఒంటిపు ప్రియాంక. జెడ్పిటిసి రేగం. మత్స్యలింగం. స్థానిక సర్పంచ్లు వెంకట పూర్ణిమ సాంబ, వెలుగు ఏపిడి, వెలుగు ఏసీ కృష్ణారావు, వెలుగు ఎపిఎం చిన్నారావు, సీసీలు పాల్గొన్నారు.

'మిషన్ వాత్సల్య'కు గడువు పెంచాలి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మిషన్ వాత్సల్య పథకంకు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే నెల వరకు గడువు పొడిగించాలని చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ పోరం మండల అధ్యక్షుడు కొర్ర ప్రసన్నకుమార్ కోరారు. .బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అనాధ అభాగ్య పిల్లలకు ఈ పథకం చేరువా కావాలంటే గడువు తేదీని పొడిగించాలని డిమాండ్ చేసారు. ఈ పథకానికి సంబందించిన వివిధ ధ్రువపత్రాలతో అర్హులైన వారు సంబంధిత కార్యాలయంలో లేదా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

రూ.11.89 కోట్లు ఈబీసీ నేస్తం విడుదల

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : వైఎస్ఆర్ ఈబీసీ నేస్తం పథకం రెండవ విడత కింద విశాఖపట్నం జిల్లాలో రూ.11,89,65,000 మొత్తాన్ని చెక్కు రూపంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ప్రజా ప్రతినిధులతో కలిసి బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెండవ విడత ఈబీసీ నేస్తం పథకం ద్వారా జిల్లాలో 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న 7931 మంది అగ్రవర్ణ పేదలకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. ఈ పథకానికి సంబంధించి ఏమైనా సమస్యలుంటే సంబంధిత సచివాలయం దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తారన్నారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాల పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రసాద్, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రమణమూర్తి, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ఇన్‌ఛార్జి పూర్ణిమదేవి, మహిళా లబ్ధిదారులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడటం అందరి బాధ్యత

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించడం కోసం ఎవరు ముందుకు వచ్చినా స్వాగతిస్తామని, దీన్ని కాపాడటం అందరి బాధ్యత అని స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఎంఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దొమ్మేటి అప్పారావు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 741వ రోజుకు చేరాయి. దీక్షల్లో హెచ్‌ఎంఎస్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ అమ్మకం బిడ్‌లో తాము పాల్గొంటామని, ప్లాంట్‌ను దక్కించుకొని ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని బిఆర్ఎస్ పార్టీ ముందుకు రావడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఇటువంటి ప్రయత్నం రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం చేసి ఉంటే బాగుండేదన్నారు.

ప్రచార భేరిని జయప్రదం చేయండి

25 అరకులోయలో భారీ బహిరంగ సభ



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఈనెల 14 నుండి 30 వరకు జరిగే ప్రచార బేరి యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, అల్లూరి జిల్లా కార్యదర్శి పి అప్పనర్స పిలుపునిచ్చారు. బుధవారం అరకువేలి గిరిజన సంఘం కార్యాలయంలో అరకు నియోజవర్గం విస్తత స్థాయి సమావేశం అనంతగిరి జెడ్పీటీసీ దీసరి గంగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశంలో బిజెపి పాలనతో పేదరికం పెరుగుతుందన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తుందని చెప్పారు. నరేంద్ర మోడీ ప్రధాని అయినప్పటి నుండి అదాని ఆస్తులు పెంచడం కొరకే మోడీ పని చేస్తున్నారని విమర్శించారు. గిరిజన ప్రాంతంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న జీవో నెం 3 రద్దు చేసి నిరుద్యోగులకు తీవ్ర న్యాయం చేసారని, దీనిపై వైసీపీ ప్రభుత్వం కనీసంరివ్యూ పిటిషన్ కుడా దాఖలు చేయకపోవడం దారుణమన్నారు. అటవీ చట్టాలు సవరణ చేసి నూతన అటవి చట్టం పాలసీ తీసుకొచ్చి గిరిజనులను నష్టం చేస్తున్నాయన్నారు. అటవీ సంపదని విలువైన ఖనిజాలను కార్పొరేటర్లకు అప్ప చెప్పేందుకు అటవీ చట్టాల్లో మార్పులు చేస్తున్నారని, ఇందుకు గిరిజనులు ఐక్యంగా ఉద్యమించాలని తెలిపారు. గిరిజన ప్రాంతంలో పీసా చట్టం, గ్రామ సభ లేకుండా చట్ట విరుద్ధంగా చింతపల్లి, అనంతగిరి మండలాలో హైడ్రో పవర్ ప్రాజెక్టల పేరుతో ఆదానికి కట్టబెడుతున్నారని ధ్వజమెత్తారు. బోయ వాల్మీకిలని ను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు రాష్ట్రంలో వైసిపి, టిడిపి వైఖరి ఒకే విధంగా ఉందని అందుకు బిజెపి, జనసేన మద్దతు ఇస్తున్నాయన్నారు. ఈ ప్రచారంతో కేంద్రంలో బిజెపి మోసపూరితమైన విధానాల్ని ఎండగడతామని తెలిపారు. గిరిజనుల మధ్య మత మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు బిజెపి కుట్ర చేస్తుందని అన్నారు. ఈ నెల 25న అరకువేలిలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు సిపిఎం పొలిట్ బ్యూరో మెంబర్ బీవి రాఘవులు, సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి ఉమామహేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు పి రామారావు, పోతురాజు, వివి జయ , సర్పంచ్ కిలో మోస్య, పద్మాపురం ఉపసర్పంచ్ భగత్ రాం, సిపిఎం మండల నాయకులు పి.బాలదేవ్, పి.రామన్న, గసభ మాజీ సర్పంచ్ సురేష్, సుంకరమెట్ట సర్పంచ్ చినబాబు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణంతో గ్రామాలాభివృద్ధి

పాడేరు ఎఎస్‌పి శివకిషోర్

ప్రజాశక్తి-పెదబయలు: మావోయిస్టు ప్రభావిత ప్రాంతం ఇంజరి పంచాయతీ కేంద్రంలో జిల్లా ఎఎస్‌పి శివకిషోర్ బుధవారం పర్యటించారు. స్థానిక ప్రజలతో మమేకమయ్యారు. స్థానిక ఎస్ఐ పులి మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో మెగా వాలీబాల్ టోర్నీ, మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఇంజరీ, గిన్నెలకోట, హమిగుడ సర్పంచులు మాట్లాడుతూ, మండలంలో మారుమూల తపంచాయతీలు అబివృద్ధికి అమడ దూరంలో ఉన్నాయయన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు చేరడం లేదని నేటికీ. ఆధార్ అనుసంధానం కాలేదన్నారు. సమస్యల పరిష్కారానికి మార్గం చూపాలని తెలిపారు.

ఈ సందర్భంగా శివ కిషోర్ మాట్లాడుతూ, ఇంజరిలో మంచినీరు, విద్య, వైద్యం సంపూర్ణంగా అందించాల్సి ఉందని, పంచాయతీ ప్రజలు సహకరిస్తే అన్ని సానుకూలంగా సాగుతాయన్నారు. సంఘ విద్రోహ శక్తులకు దూరంగా ఉండాలని, యువత చదువుకుని ఉద్యోగాలు సాధించాలన్నారు. ప్రతి గ్రామంలో రహదారి సౌకర్యం ఉంటే ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా మీకే చెందేలా చర్యలు తీసుకుంటామన్నారు. మావోయిస్టులకు సహకరిస్తూ ప్రాణాలు పోగొట్టు కోవద్దని సూచించారు. పిల్లలను బడికి పంపించాలని, యువత సంబంధిత ధవీకరణ పత్రాలతో దరఖాస్తు చేస్తే బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేస్తానని భరోసా కల్పించారు. మద్యలో చదువు విడిచిన యువతకు ఉపాధి శిక్షణకు సహకరిస్తామన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ ప్రాంత ప్రజల అభిప్రాయం మేరకు ప్రాధమిక ఆరోగ్య కేంద్రం మంజూరుకు కృషి చేస్తానన్నారు. రేషన్ కార్డులు లేని వారిపై సమగ్ర సర్వే జరిపించి అన్ని సమస్యలు ఒక్కొకటిగా పరిష్కారం దిశగా ముందుకు పోదామన్నారు. ప్రతి గ్రామంలో రహదారి ఉంటే అభివృద్ధి తనంతట తానే వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ పులి మనోజ్ కుమార్, అధికసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాడే రు ఎఎస్‌పి శివకిషోర్

సుబ్బారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో/గాజువాక

'ఆఖరి క్షణం వరకూ ఉద్యమమే ఊపిరిగా జీవించిన కమ్యూనిస్టు, ప్రజలతో గొప్ప అనుబంధం గల నాయకుడు జి సుబ్బారావులి అంటూ పలువురు సిపిఎం నేతలు ఆయన్ను కొనియాడారు. బుధవారం ఉదయం షీలానగర్‌లోని అతని స్వగృహానికి సమీపంలోగల పోస్టాఫీసు గ్రౌండ్స్‌లో గాజువాక సిపిఎం నాయకులు జి.సుబ్బారావు సంతాప సభ అత్యంత ఘనంగా జరిగింది. వందల సంఖ్యలో ఆయన అభిమానులు, ట్రేడ్ యూనియన్, ఇతర సంఘాలకు చెందిన కార్యకర్తలు, సిపిఎం నాయకులు తరలి వచ్చారు. సుబ్బారావు అమర్‌రహే... ఉద్యమాలు జిందాబాద్ అంటూ అక్కడకు వచ్చిన సిపిఎం, సిఐటియు శ్రేణులంతా నినాదాలు చేశారు. సభా వేదికపై ఆయన కుటుంబ సభ్యుల సమక్షంలో వివిధ పార్టీల నాయకులు ఘనంగా సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు అధ్యక్షతన జరిగిన సభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సుబ్బారావులోని కమ్యూనిస్టు అంకితభావాన్ని అభినందించారు. ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంతో కూలిపోతుందని నమ్మిన సుబ్బారావు కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలన్న ధృఢ సంకల్పంతో తన జీవిత కాలం కృషిచేశారన్నారు. సోషలిజానిదే భవిష్యత్ అని ఆయన నమ్మారని, అందుకు తగ్గట్టుగానే ప్రపంచం మారుతుందని అమెరికా, వెనిజులా వంటి దేశాల్లో పలు పరిణామాలు రుజువు చేస్తున్నాయని ఉటంకించారు. విశాఖ అంటేనే ప్రభుత్వరంగంపై ఆధారపడి ఉన్నందున ఇదొక ఫైనాన్షియల్ కేపిటల్‌గా భాసిల్లుతుందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఇక్కడ లేకపోతే విశాఖ పేరును ఊహించగలమా? అని ప్రశ్నించారు. సుబ్బారావు లాంటి వ్యక్తులు చేసిన పోరాటాల స్ఫూర్తితో స్టీల్‌ప్లాంట్ రక్షణకు నడుం కట్టాలని, అదే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌లోని కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై సుబ్బారావు పనిచేసి ఉద్యమాన్ని నిర్మించారన్నారు. ఈ ప్రాంతంలో 1000 ఎకరాల ఇనాం భూములను పెద్దలు కాజేయ్యాలని చూడగా వాటిని పేదలకు పంచేందుకు జరిగిన పోరాటంలోనూ సుబ్బారావుది కీలకపాత్రేనన్నారు. ఈ విషయంలో నాటి పత్రికల యాజమాన్యాలు ప్రభుత్వం, స్థానిక పెద్దలవైపు ఉండగా ఆనాడు గాజువాకలోని జర్నలిస్టులు మాత్రం తమ యాజమాన్యాల విధానాన్ని ఉల్లంఘించి పేదలకు అనుకూలంగా వార్తలు రాశారని కొనియాడారు.

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ, సుబ్బారావు గాజువాకకే కాకుండా విశాఖ పారిశ్రామిక లోకానికి చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. సుబ్బారావును తమ ఇంట్లో ఒక సభ్యునిగా చూసేవారమని, ఆయన మృతిచెందడంతో కుటుంబంలో వ్యక్తి కోల్పోయిన అంత బాధగా ఉందన్నారు. ఆయన కార్మికులకు చేసిన సేవలు మరువలేనివన్నారు. 2017లో తాను కార్పొరేటర్ ఉన్నప్పుడు సుబ్బారావు, తాను కలిసి షీలా నగర్ ముంపు సమస్య పరిష్కారానికి కృషి చేశామని తెలిపారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ, బిహెచ్‌పివలో పనిచేస్తూనే ఆటోనగర్ కార్మిక సమస్యలపై సుబ్బారావు పోరాటం చేశారన్నారు. భూ పోరాటాన్ని గాజువాకలో జయప్రదం చేశారని తెలిపారు. ఏపీ మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఎం.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, అనారోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా కరోనా సమయంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్మికుల సమస్యలపై పోరాటానికి విజయవాడ వచ్చారని గుర్తు చేశారు. సిపిఐ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ సుబ్బారావు ధన్యజీవి అన్నారు. శ్రామిక మహిళా కన్వీనర్ ధనలక్ష్మి మాట్లాడుతూ, సుబ్బారావు కార్మికవర్గ శత్రువుల గుండెల్లో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్.రాజేంద్రప్రసాద్, ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పద్మ, వై.సత్యవతి, సిఐటియు నాయకులు అయోధ్యరాం, యు.రామస్వామి, కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, చందు, సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, క్రాంతి ప్రాపర్టీస్ అధినేత చిన్నరావు పాల్గొన్నారు.

నేడు విశాఖలో కేంద్ర స్టీల్ సహాయమంత్రి పర్యటన

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : కేంద్ర స్టీల్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ఫగ్గాన్ సింగ్ కులస్తే గురువారం విశాఖలో పర్యటించనున్నారు. ఉదయం 5 గంటలకు ఢిల్లీలో బయలుదేరి 8:15 గంటలకు విశాఖ చేరుకుంటారు. ఉదయం 10:30 గంటలకు పోర్టు కళావాణి ఆడిటోరియంలో జరిగే ప్రధానమంత్రి రోజ్‌గార్ మేళాలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు ఆర్ఐఎన్ఎల్ అధికారులతో, 3:45 గంటలకు స్టీల్‌ప్లాంట్ యూనియన్ల ప్రతినిధులతో సమావేశం కానున్నారని అధికారులు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి ఢిల్లీ తిరుగు ప్రయాణం కానున్నారు.

డిఎల్‌పిఒ పర్యటన


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డిఎల్‌పిఒ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం డివిజనల్ పంచాయతీ అధికారి వివి శ్రీనివాసరావు మండలంలో బుధవారం పర్యటించారు. మండలంలోని పోక్సుపేట, ఐ.పోలవరం సచివాలయాలను సందర్శించారు. రెండు సచివాలయాల్లో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

20న ఎంపీల ఇళ్ల వద్ద పెన్షనర్ల భిక్షాటన

ప్రజాశక్తి -కంచరపాలెం: ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న ఎంపీల ఇళ్ల వద్ద ఖాళీ పళ్లేలను మోగించి భిక్షాటన చేసే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూనియన్ నేతలు కోరారు. బుధవారం హాష్మీ భవన్‌లో యూనియన్ నెలవారీ సమావేశం నిర్వహించారు. ముందుగా ఇటీవలే మరణించిన సిఐటియు నేత జి సుబ్బారావుకు శ్రద్ధాంజలి ఘటించారు. పెన్షనర్ల సంఘానికి సుబ్బారావు చేసిన సాయం, సేవలను కొనియాడారు. తరువాత సర్ధార్ హాష్మీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి అరుణ్‌జీ, హుస్సేన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. హాష్మీ జీవిత విశిష్టతను వివరించారు. అనంతరం పెన్షనర్ల సమస్యలపై చర్చించారు.

ఈనెల 20న ఆల్ ఇండియా కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఇపియస్ పెన్షనర్స్ అసోసియేషన్స్ పిలుపు మేరకు ఎంపీల ఇళ్ల వద్ద చేపట్టే నిరసనలో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కె.సుధాకర్, జిల్లా కార్యదర్శి హుస్సేన్, రంగా, అరుణ్ జీ మాట్లాడారు.

నలబై ఏళ్లు దాటితే కంటి పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి - ఆరిలోవ : నలబై ఏళ్లు దాటిన ప్రతిఒక్కరూ విధిగా కంటిపరీక్షలు చేయించుకోవాలని ఎల్‌వి.ప్రసాద్ నేత్ర విజ్ఞాన సంస్థ, జిఎంఆర్ వరలక్ష్మీ ప్రాంగణం ఆప్తమాలజిస్ట్, కన్సల్టెంట్ డాక్టర్ శివాని కొడాలి అన్నారు. సాధారణంగా ఆ వయస్సులో ఉన్న వారికి కంటి చూపు తగ్గి,, పొడిబారిన కళ్ళు, శుక్లం, గ్లకోమా, మధుమేహ రెటినోపతి, వయో సంబంధిత మాక్యులర్ క్షీణత వంటి కొన్ని కంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. దృష్టి హాని, పార్శ్వదృష్టి లోపం, ధృష్టిలో హెచ్చు తగ్గులు, ఫ్లోటర్లు, వక్రంగా చిత్రాలు చూడటం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందని, ముఖ్యంగా మధుమేహం, అధిక రక్తపోటు ఉన్నవారు మరీ జాగ్రత్తగా ఉండాలన్నారు స్త్రీలకు మెనోపాజ్ సమయంలో హార్మోనులలో మార్పులు కూడా కంటి సమస్యలు ప్రేరేపించవచ్చన్నారు. వీటిని పరిగణంలోకి తీసుకొని 40 ఏళ్లు దాటిన వారంతా వార్షికంగా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైజ్ఞానిక సంస్థ అన్ని రకాల కంటి రుగ్మతలకు సమగ్ర రోగ నిర్ధారణ, వైద్య, శస్త్రచికిత్స సేవలను అందిస్తుందన్నారు.

అప్పన్న సేవకులకు నూతన వస్త్రాలు

ప్రజాశక్తి- సింహాచలం: సింహాచల దేవస్థానంలో నిత్యం పల్లకి మోస్తూ స్వామి సేవలో తరిస్తున్న బోయలను బుధవారం సింహాచల దేవస్థానం ట్రస్ట్‌బోర్డ్ సభ్యులు, విజెఎఫ్ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. స్వామి సేవలో తరిస్తున్న వీరికి చేతనైన సాయం చేయడం, నూతన వస్త్రాలను అందించడం ఆనందంగా ఉందని గంట్ల శ్రీనుబాబు అన్నారు. కాగా ఏటా తమకు నూతన వస్త్రాలను ఇస్తున్న శ్రీనుబాబుకు బోయలు కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

ఐసిడిఎస్ పీడీకి సిఐటియు వినతి



ఐసిడిఎస్ పీడీకి వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి - రంపచోడవరం

రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో వున్న వేతనాలు, బిల్లులు చెల్లించాలని సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. బుధవారం అల్లూరి జిల్లా ఐసిడిఎస్ పీడీ చొరవతో సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, యూనియన్ ప్రాజెక్ట్ లీడర్లతో జాయింట్ మీటింగ్ రంపచోడవరం ఐటిడిఎ గ్రీవెన్స్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ చింతూరు, కూనవరం, విఆర్ పురం మండలాల్లో గతంలో వచ్చిన వరదలు కారణంగా చాలా అంగన్వాడీ కేంద్రాల్లో వంట పాత్రలు, ఇతర ఫర్నిచర్ కొట్టుకుపోయాయని, వాటిని మళ్లీ సమకూర్చాలని కోరారు. మినీ అంగన్వాడీ కేంద్రాలను జనాభా ప్రాతిపదికగా మెయిన్ సెంటర్‌లుగా అప్‌గ్రేడ్ చేయాలన్నారు. 2021, 2022 సంవత్సరాల్లో ఫిబ్రవరి నెలల జీతాలు చెల్లించాలని కోరారు.

అనంతరం గ్యాస్ బిల్ రేటు పెంచాలని, వంటకు సరిపడా ఆయిల్ ఇవ్వాలని, అంగన్వాడీ సెంటర్లలో కరెంట్ బిల్లుల సమస్యను పరిష్కరించాలని, అంగన్వాడీ కేంద్రాలను దగ్గరగా వున్న సెక్టార్లలో కలపాలని, మినీ అంగన్వాడీ కార్మికులకు మే నెలలో సెలవులు మంజూరు చేయాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఐసిడిఎస్ పీడీ సమర్పించారు. దీనికి స్పందించిన పీడీ మాట్లాడుతూ సమస్యలన్నీ పరిష్కారం కొరకు కృషి చేస్తామని, పాలసీతో ముడిపడిన డిమాండ్లను పై అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ యూనియన్ నాయకులు నిర్మల, రంగమ్మ, అన్నపూర్ణ, సూర్యకుమారి, రామలక్ష్మి, రాణి, వెంకటలక్ష్మి, రత్నకుమారి, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

నిర్మించారు.. వదిలేశారు...

- ఏడేళ్ల క్రితం నిత్యావసర వస్తువుల నిల్వ గిడ్డంగి భవన నిర్మాణం
- ప్రారంభానికి నోచక శిథిలావస్థకు చేరుకుంటున్న వైనం

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరులో ఏడేళ్ల క్రితం నిర్మాణం చేసిన జిసిసి నిత్యావసర వస్తువుల నిల్వ గిడ్డంగి భవనం నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా, ప్రజా నిధులు దుర్వినియోగానికి ప్రత్యక్ష సాక్ష్యంగా ఈ నిల్వ గిడ్డంగి భవనం ఉంది. ఏడేళ్లయినా ప్రారంభించకపోవడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకొనే పరిస్థితి నెలకొంది.

జిసిసి డిఆర్ డిపోల ద్వారా ప్రజలకు సరఫరా చేసే బియ్యం, పప్పులు, నూనె తదితర నిత్యావసర సరుకులను నిల్వ వుంచేందుకు కొయ్యూరు మండల కేంద్రంలో గిడ్డంగి భవనం లేకపోవడంతో మైదాన ప్రాంతమైన గొలుగొండ మండలం కృష్ణదేవిపేటలోని ఎంఎల్ఎస్ పాయింటులో నిత్యావసర వస్తువుల నిల్వ ఉంచి అక్కడ నుండి మండలంలోని డిఆర్ డిపోలకు గత కొన్నేళ్లుగా సరఫరా చేస్తున్నారు. మండల కేంద్రంలో నిల్వ గిడ్డంగి ఉండాలన్న ఉద్దేశంతో ఐటిడిఎ ఉన్నతాధికారులు సుమారు ఏడేళ్ళ క్రితం మండలంలోని కాకరపాడు, రాజేంద్రపాలెం మధ్యలో లక్షల రూపాయలు ఐటిడిఎ నిధులతో భవనాన్ని నిర్మించారు. ఇది నిర్మించి, ముస్తాబు చేసి ఏళ్ళ గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. దీని వైపు అధికారులెవరూ కన్నెత్తి కూడా చూడలేదు. ఏళ్ల తరబడి ఈ భవనాన్ని ఉపయోగించకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటుంది. అసలు ఈ భవనం ఎందుకు నిర్మించినట్టో..? ఎందుకు నిరుపయోగంగా వదిలేసినట్టో..? తెలియక మండలవాసులు అయోమయానికి గురవుతున్నారు. ప్రస్తుతం జిల్లాల పునర్విభజన జరిగాక కూడా స్థానికంగా ఉన్న గొడౌన్‌ను వినియోగించుకోకుండా, అనకాపల్లి జిల్లాలో ఉన్న కృష్ణదేవిపేట ఎంఎల్ఎస్ పాయింట్ నుండే మండలంలోని డిఆర్ డిపోలకు నిత్యావసర సరుకులు సరఫరా చేయడం శోచనీయం. ఇప్పటికైనా జిల్లా, ఐటిడిఎ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ భవనాన్ని వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.


నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోని జిసిసి నిత్యావసరాల గొడౌన్

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న ఆశా సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని ఉలుమూరులో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కల్లూరి రామకృష్ణ తాటాకు ఇల్లు, ఇంటిలో ఉన్న సామాన్లు పూర్తిగా దగ్ధమై సర్వం కోల్పోయి కట్టుబట్టలతో రోడ్డున పడగా, కుటుంబానికి ఆశా సంస్థ తమ వంతు ఆర్థిక సాయం అందించారు. ఆశా కార్యదర్శి సయ్యద్ సుభాని ఆధ్వర్యాన అగ్ని ప్రమాదబాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి రూ.5వేలు ఆర్థిక సాయం, తార్పలిన్ కవర్, దుప్పట్లు, బట్టలు, గూంజ్ సహకారంతో డ్రై రేషన్ కిట్, బట్టల కిట్లు అందజేశారు. మరికొంత మంది ముందుకు వచ్చి నగదు, వస్తు రూపేణ సహాయం చేసి వారిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా సంస్థ సంయుక్త కార్యదర్శి జట్వాటి వెంకటేష్, ఉలుమురు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

త్వరితగతిన నాడు-నేడు పనులు పూర్తి


సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపిడిఒ బాపన్న దొర

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని జరుగుతున్న నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో కె బాపన్నదొర సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండలంలోని చెరుకుంపాలెం, జడ్డంగి, తంటికొండ, దూసరిపాము, రాజవొమ్మంగి 1, 2, శరభవరం, బడదనాంపల్లి సచివాలయాల్లో ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎస్డిజి సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సంబంధిత డిజిటల్ అసిస్టెంట్లు సర్వీస్ ఛార్జ్ అమౌంట్‌లను ఎప్పటికప్పుడు సంబంధించిన హెడ్స్‌లో జమ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జూ పార్కులో బ్యాటరీ వాహనాల ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతుప్రదర్శన శాలలో బుధవారం 10 బ్యాటరీ వాహనాలను చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(సిసిఎఫ్) శ్రీకంఠనాధ రెడ్డి బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జూ పార్కులో కర్బన ఉద్గారాల తీవ్రతను తగ్గించడానికి ఈ వాహనాలు ఎంతో దోహద పడతాయన్నారు. 10 మంది వరకు సీటింగ్ సామర్థ్యం ఉన్న ఈ వాహనాలు జూ పార్కు ప్రధాన ద్వారం వద్ద కొన్ని, సాగర్ గేట్ వద్ద మరికొన్ని వాహనాలు అందుబాటులో ఉంటాయన్నారు.కార్యక్రమంలో ఇన్‌చార్జ క్యూరేటర్ జి.మంగమ్మ, డిఎఫ్ఒ లక్ష్మణ్, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలనాయుడుపాల్గొన్నారు.